

ఎన్‌పిఐసి అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదువుచున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు తల్లికి వందనం పథకం, స్కాలర్ షిప్ మంజూరు కావడానికి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాను, ఇంటర్ విద్యార్థుల ఖాతాకు ఎన్‌పిఐసి అనుసంధానం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమాధికారి, సాధికారత అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ఏఎస్‌డబ్లూఓ నాగేశ్వర్‌రావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. అర్హులకైన వారు మీ దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా, బ్యాంకు వారిని, పోస్ట్ ఆఫీస్ వారిని సంప్రదించి బ్యాంకు ఖాతాకు ఎన్‌పిఐసి అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఒకవేళ బ్యాంకు ఖాతా లేకుంటే పోస్టల్ బ్యాంకులో నూతన ఖాతాను తెరిచి ఎన్‌పిఐసి అనుసంధానం చేసుకోవాలని కోరారు.

10న పేరెంట్ టీచర్స్ సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విలేకర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత ఏడాది విద్యాశాఖ తరఫున మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ఇన్చార్జి మినిస్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో కూడా సర్పంచ్ మొదలుకొని ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు (ప్రైవేట్, ప్రభుత్వ), జూనియర్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం భోజనం సమయం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధిని నిర్ధారించడానికి పాఠశాల విద్య, సమాజ భాగస్వామ్యంతో 10న మెగా పిటిఎం2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009, జాతీయ విద్యావిధానం 2020, విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం ముఖ్యంగా తల్లితండ్రుల పాత్ర మెగా పిటిఎంలో కీలకమని, మెగా పిటిఎం ద్వారా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి వేదికగా పనిచేస్తోందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సమావేశంలో పాఠశాల విద్యాపరమైన పనితీరు, మౌలిక సదుపాయాలు, కార్యాచరణ ప్రణాళికలను తెలియజేస్తారు. సరదా కార్యకలాపాలు, ఆటలు ద్వారా కార్యక్రమంలో పాల్గొన్న అందరి తల్లిదండ్రుల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, ఏక్ పేడ్ మాకే నామ్ భాగంగా గ్రీన్ పాస్పోర్ట్ ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులకు మొక్కలు సరఫరా చేయడానికి నమోదు చేసుకోవడానికి ఎల్ఈపిఏ యాప్' అందుబాటులో మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయని తెలిపారు.

కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): మామిడి ప్రాసింగ్ యూనిట్లు మామిడి పండ్లు కనీస ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో చిత్తూరు ఉమ్మడి జిల్లాలో మామిడికాయ గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో సమావేశం, నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఎండి శేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ మామిడికాయ రైతులను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వచ్చే బడ్జెట్లో మ్యాంగో బోర్డు చిత్తూరులో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదికలు అందజేయడం జరిగిందని తెలిపారు. పల్ప్ ప్రాసెసింగ్‌లో 8 కోట్లు బకాయిలు విడుదల చేయడానికి ప్రభుత్వం పరిశీలనలో ఉన్నదని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్లుకి కూడా మామిడి ప్రాసింగ్ ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ రద్దు చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే లేఖ రాశారని తెలిపారు. సమస్యలు పరిష్కారం కొరకు ఏ సమయంలోఎప్పుడూ కావాలన్న జోక్యం చేసుకుని ప్రాసెసింగ్ యూనిట్లుకి మద్దతు సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఇప్పటి వరకూ రూ.1.15 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు జరిగిందని ఇంకా రూ.1.70 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ఉత్పత్తి ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. కంపెనీల యాజమాన్యులు మాట్లాడుతూ మ్యాంగో పల్ప్‌పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా అధికారులు కృషి చేయాలని, మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు మూడు రోజుల పాటు మ్యాంగో జ్యూస్, పవిత్ర దేవాలయాలలో, భక్తులకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని పరిశ్రమల ప్రతినిధులు సమావేశంలో దృష్టికి తీసుకువచ్చారని అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారంగా గుడ్డును అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ అంశంపై అధ్యయనం చేసి తదుపరి ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరితో కలిసి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

విట్నస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలలో ఈనెల 10వ తేదీ జరిగే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో విట్నస్ అధికారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులే నియమించుకుని వారిచేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల విద్యాభివృద్ధి మీద, పాఠశాలల్లో ఉన్న మౌళిక సదుపాయాల మీద మాట్లాడుకోవడానికి 17 రకాల కమిటీలు, ఫోటోల అప్లోడ్ లు, విట్నస్ అధికారులు ఇంత తతంగం అవసరమా..అని వారు ప్రశ్నించారు. పి.టి.ఎం. కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చడం సరికాదని, విద్యార్థుల విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా దీనిని మార్చాలని యుటియఫ్ కోరుతున్నదని వారు పేర్కొన్నారు. బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగిస్తుందని వారు విమర్శించారు. పాఠశాల ప్రారంభమైన నెల రోజుల లోపే యోగా పేరుతో వారం రోజులు, పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయాన్ని హరిస్తున్నారని వారు విమర్శించారు. ఒక ప్రక్క విద్యార్థుల ఔట్పుట్ కోసం పర్యవేక్షణ అధికారులు పాఠశాలలకు వస్తారని చెబుతూ మరోపక్క బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులని తిపుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా, బోధనేతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడికి గురి చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాల సమయంలో బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను వినియోగించు కునేటట్లు చూడాలని, మెగా పి.టి.ఎం.లో విట్నస్ అధికారి నియామకాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పులిచెర్లలో ఏనుగు మృతి



ప్రజాశక్తి- రొంపిచెర్ల: పులిచెర్ల మండలంలోని కల్లూరు-సదుం రహదారిలోని పూరేడివారి పల్లి గ్రామం సమీపంలోని పెద్దఒడ్డు చెరువు కట్ట కింద వెదురు పొదల్లో ఒక ఏనుగు చనిపోయి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించారు. ఏనుగు మృతి చెందిన విషయాన్ని చిత్తూరు వెస్ట్ ఎఫ్ఆర్ఓ చిత్తూరు జిల్లా డిఎఫ్‌డికి తెలియజేయడంతో వారు సంఘటన్నా స్థలానికి చేరుకుని ఏనుగు మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందింది ఓ ఆడ ఏనుగని, ఏనుగు చెరువు కట్టపైకి వెళ్లడానికి ప్రయత్నిస్తూ జారి తలకిందులుగా కింద పడటంతో చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం చిత్తూరు వెస్ట్ ఎఫ్ఆర్ఓ, తిరుపతి ఎస్వీ జూ పార్క్ వెటర్నరీ డాక్టర్, సిబ్బంది మధ్యాహ్నం సదరు ప్రాంతానికి చేరుకుని చనిపోయిన ఆడ ఏనుగు కళేబరాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన ఆడ ఏనుగు మామిడి కాయలు అధికంగా తినడం వల్ల జీర్ణంకాక, అనారోగ్యానికి గురై చనిపోయినట్లుగా నిర్ధారించారు. అలాగే మరిన్న పరీక్షలకు చనిపోయిన ఏనుగు వివిధ భాగాలు శాంపిల్స్ తీసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం అదే ప్రాంతంలో జెసిబితో గుంత తీసి ఏనుగు కళేబరాన్ని పూడ్చి వేశారు.


ఏనుగుల దాడులను అరికడతాం:డిఎఫ్ఓ

డిఎఫ్ఓ ధరణి మాట్లాడుతూ పులిచెర్ల మండలంలో ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్నటువంటి ప్రాంతాలను గుర్తించి సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఏనుగుల భారి నుండి పంటలను రక్షించుకునేందుకు, ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించే దిశగా కృషి చేస్తామని అన్నారు.

కల్లూరు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరుఅర్బన్: శనివారం ఉదయం పులిచర్ల మండలం పూరేడివాడిపల్లి వద్ద ఏనుగుమృతి చెందిందని గుంపులోని ఏనుగు మృతి చెందడంతో తిరిగి అదే ప్రాంతానికి ఏనుగులు వచ్చే ప్రమాదం ఉన్నందున కల్లూరు సమీప ప్రాంతాలో అటవి ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నందున ఈ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ రాత్రి సమయాల్లో బయటకు రాకూడదని ఒక ప్రకటనలో డిఎఫ్ఐ భరణి తెలిపారు.

డెంగీ నివారణ మాసోత్సవాలు




సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లకు వైద్య ఆరోగ్యశాఖ రివ్యూ మీటింగ్ జరిగింది. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ రాబోవు సీజన్ వర్షాకాలం కావున ప్రభుత్వం ఈనెల పూర్తిగా డెంగీ నివారణ మాసో త్సవంగా ప్రకటించిందని, కావున జిల్లాలోని అధికారులు అందరూ డెంగీ నివారణకు ముందస్తు జాగ్రత్తలైన దోమలు పుట్టకుండా చూడటం, లార్వాలను పూర్తిగా నాశనం చేయటం అలాగే రక్త పూతల పరీక్షలను పెంచడం, ఫీల్డ్ స్టాఫ్ అందరికీ రక్త నమోనాల పరీక్షల నిమిత్తమే ఆర్డిటి కిట్లు ఇవ్వటం, ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూడటం, ఫ్రైడే డ్రైడే సమిష్టిగా అందరూ తప్పక చేయటం, ప్రతి గ్రామంలో ఫీల్డ్‌స్టాఫ్ ద్వారా విపులంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రక్త నమూనా పరీక్షల ర్యాంకింగ్‌ని పెంచడం ల్యాబ్ టెక్నీషియన్ల విధి అన్నారు. ఫీల్డ్ స్టాఫ్ అందరు డెంగీ లక్షణాలున్న ప్రతి కేసును రక్త పూతల ప్రక్రియ చేసే విధంగా మానిటర్ చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి లాప్స్ లేకుండా వైద్యాధికారులు రోజువారి మానిటర్ చేయాలన్నారు. అలాగే అనుమానిత లక్షణాలున్న వారికి టిబి నిర్ధారణకు గళ్ళ పరీక్ష చేయించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లామలేరియా అధికారి వేణుగోపాల్, సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రిలైట్ కోర్సు ఉచిత శిక్షణ

ప్రజాశకి- చిత్తూరు అర్బన్: జిల్లా ఉపాధి, శిక్షణ కార్యాలయం తరపున ఉపాధి అవకాశంతో రిటైల్ కోర్సును బేసిక్స్ ఉచిత శిక్షణ నిర్వహిస్తోంది. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు 10 వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అర్హులు. అర్హత ఉన్న ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీ జిల్లా ఉపాధికార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. జిల్లా ఉపాధి కార్యలయం వద్ద నిర్వహించబోయే ఈ రిటైల్ ట్రైనింగ్ కోర్సుకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. ఇతర వివరాల కోసం 76710 66532, 91822 61045, 8328 677983 ఫోన్‌నెంబర్లు సంప్రదించాలని తెలిపారు.

గుంతలమయంగా రోడ్లు



ప్రజాశక్తి- గంగవరం : గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి నుండి బైరెడ్డిపల్లి వెళ్లే రహదారిలో రోడ్డు మరమ్మతులకు గురై కంకర తేలి గుంతలు పడడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. పుంగనూరు -పలమనేరు రహదారి గత మూడు సంవత్సరాల క్రితం నూతనంగా తారువేసి రోడ్డు వెడల్పు చేశారు. అయితే నాణ్యత లోపంతో అక్కడక్కడ కంకర తేలిపోయి గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గుంతలలో ద్విచక్రవాహనదారులు పడి అనేక ప్రమాదాలు కూడా జరిగాయి. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిలో గుంతలను మరమ్మతులు చేయాలని ప్రజలకు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌లో 8,861 కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అన్ని రకాల కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ 5వతేదీ శనివారం నిర్వహించడం జరిగింది. దేశవ్యాప్తంగా 5న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించబడుతోందని, వివిధ రకాల కేసుల పరిష్కారాన్ని లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. ఆమె మాట్లాడుతూ క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, విమాన/వాహన ప్రమాద నష్టపరిహార, వైవాహిక వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, భూమి స్వాధీనం కేసులు, విద్యుత్, నీటి బిల్లులు (దొంగతనం కేసులు తప్పించి), జీతభత్యాలు, పెన్షన్ లభించే సేవా సంబంధిత అంశాలు, రెవెన్యూ కేసులు, ఇతర సివిల్ కేసులు ఈ నేషనల్ లోక్ అదాలత్‌లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చిత్తూరు జిల్లాలోని 13 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే తిరుపతి, మదనపల్లె, శ్రీకాళహస్తి, పీలేరు, పుత్తూరు, పుంగనూరు, పలమనేరు, పాకాల, కుప్పం, వాయలపాడు, సత్యవేడు, నగరి, తంబళ్లపల్లి ప్రాంతాల్లో 8,861 కేసులు గుర్తించిన్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా, ప్రజలకు వేగవంతమైన, ఖర్చులేని న్యాయ సేవలందించాలనే లక్ష్యంతో, అన్ని విభాగాల్లో కేసుల పరిష్కారం సాధించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

109 కేసులు పరిష్కారం

విజయపురం (నగరి): స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం న్విహించిన లోక్ అదాలత్‌లో 109 కేసులు పరిష్కారం కాగా రూ.17,21,285 రూపాయల సెటిల్‌మెంట్ జరిగిందని నగరి ఇన్‌చార్జి జడ్జి సి. జానకి తెలిపారు. ఒక సీటీ కేసు, 23 సీసీ, ఎంసీ కేసులు, 7 బ్యాంకు కేసులు, 78 ఎస్టీ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

203 కేసులు పరిష్కారం

పలమనేరు: పలమనేరు కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 203 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ తెలిపారు. పలమనేరు కోర్టు పరిధిలో సివిల్, క్రిమినల్, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.1,13,84,842లుగా ఉన్నట్టు ఆయన తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్.భాస్కర్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు

ఎమర్జెన్సీలో వైద్యుల నిర్ణయాలే జీవితాలను నిలుపుతాయి




సమావేశంలో మాట్లాడుతున్న అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అత్యవసర పరిస్థితుల్లో వైద్యులు తీసుకునే నిర్ణయాలు ఎంతో కీలకమని, అవి ఒక వ్యక్తి జీవితాన్ని నిలుపగలవని అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ అన్నారు. చిత్తూరులోని అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లోని సెమినార్ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే అక్యూట్ క్రిటికల్ కేర్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ వినోద్ భట్ మాట్లాడుతూ దేశంలో సుమారు 80 శాతం మంది ప్రజలు స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యసేవలపై ఆధారపడుతున్నారని ఇలాంటి సమయంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో అపోలో మెడికల్ ఎడ్యుకేషన్ అత్యవసర వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలను అందిస్తూ, కొత్త తరానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. అత్యవసర వైద్యంలో వైద్యులు మానసికంగా, సాంకేతికంగా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా ఈ తరహా శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కోర్సు ప్రత్యేకతను డీన్ ప్రొఫెసర్ ఆల్ఫ్రెడ్ జెఆగస్టిన్ వివరిస్తూ... సాధారణ శిక్షణలు ప్రమాద సమయంలో 'గోల్డెన్ అవర్'కే పరిమితమవుతాయని, కానీ 'అక్యూట్ క్రిటికల్ కేర్ కోర్స్' మాత్రం ఆ తరువాత వచ్చే అత్యంత క్లిష్ట సమయంలో వైద్యులు తీసుకునే కీలక నిర్ణయాలు, చికిత్సా పద్ధతులు వంటి అంశాలపై లోతుగా శిక్షణ ఇస్తుందని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు గోల్డెన్ అవర్ తరువాత కూడా చికిత్సను కొనసాగించే నైపుణ్యాలను అభివద్ధి చేయడమే ఈ కోర్సు ప్రధాన లక్ష్యమని వివరించారు.

జగన్ సభను జయప్రదం చేయండి

పుంగునూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బంగారుపాళ్యంలో మీడియాతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభను జయప్రదం చేయాలని పుంగనూరు శాసనసభ్యులు పెద్ద రెడ్డి రామచంద్ర రెడ్డి కోరారు. శనివారం మండలంలోని జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా స్వగృహంలో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో మామిడికి సరాసరి రూ.22 లకు అమ్ముడుపోయిందని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మామిడి కొనుగోలు చాలా దారుణంగా ఉన్నదని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేపట్లేక వ్యాపారస్తులు రైతులను నడ్డి విరిస్తున్నారని ప్రతి రైతుకు అండగా వైఎస్ఆర్సిపి పార్టీ ఉంటుందని తెలిపారు. మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి, సర్పంచులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, వాణి ప్రియ, భారతి పాల్గొన్నారు.

పలమనేరు: మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆధ్వర్యంలో శనివారం వైసిపి పార్టీ కార్యాలయం వద్ద మండల స్థాయిలో క్యూఆర్ కోడ్ ద్వారా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదవ తేదీ బంగారుపాలెం మామిడికాయల మండి వద్దకు మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి వచ్చి మామిడికాయల రైతులను పరామర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక బార్డర్ నుండి బంగారుపాలెం వరకు రోడ్డు మార్గంలో వస్తారని, పలమనేరు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చిత్తూరులో తొలి ఐవిఎఫ్ బేబీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: డాక్టర్ రామలక్ష్మి ఫర్టిలిటీ సెంటర్ వైద్యులు చరిత్ర సృష్టించారు. చిత్తూరు పట్టణంలోని డాక్టర్ రామలక్ష్మి ఫర్టిలిటీ సెంటర్ (డాక్టర్ రామలక్ష్మి నర్సింగ్ హోం)లో ఈనెల 4వ తేదీ శుక్రవారం మొట్టమొదటి ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్)/ టెస్ట్ ట్యూబ్ బేబి శిశువు జన్మించింది. డాక్టర్ పి.రోజా ప్రియ, డాక్టర్ కె.రామలక్ష్మమ్మ, డాక్టర్ సి. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ చిత్తూరులో ఐవీఎఫ్ చికిత్సను విజయవంతం చేసినందుకు తమ ఆనందాన్ని పంచుకున్నారు. చిత్తూరు పట్టణం మురకంబట్టుకు చెందిన సుభాషిణి, భాస్కర్ దంపతులు గత 8 సంవత్సరాలుగా సంతానం కోసం ఎన్నో ఆసుపత్రులు తిరిగి, చివరకు డాక్టర్ పి.రోజా ప్రియని డాక్టర్ రామలక్ష్మి ఫర్టిలిటీ సెంటర్‌లో సంప్రదించారు. డాక్టర్ పి.రోజా ప్రియ ఈ దంపతులను క్షుణ్ణంగా పరీక్షించి, గర్భం ధరించేందుకు చికిత్స అందించారు. ఆమె తన మొదటి ఐవీఎఫ్ కేసును ఒక సవాలుగా స్వీకరించి, 2025 జూలై 4న విజయవంతం చేశారు. ఈ దంపతులు డాక్టర్ రామలక్ష్మి ఫర్టిలిటీ సెంటర్‌లో ఆరోగ్యకరమైన ఆడబిడ్డకు జన్మనిచ్చారు.

విద్యార్థుల ప్రతిభకు నూతన వేదిక 'వివిధ'

అపోలో యూనిర్శిటీ వీసీ వినోద్ భట్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ది అపోలో యూనివర్సిటీలో విద్యార్థుల మేధో, సాంస్కృతిక, క్రీడా కార్యకలాపాలకు ప్రోత్సాహం అందించే 'వివిధ' కేంద్రం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యార్థుల క్లబ్‌లు, ఎన్ఎస్ఎస్, క్రీడల కార్యాలయాలకు ఒకే కేంద్రంగా రూపొందిన ఈ హబ్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్ భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వివిధ' వేదిక యువతలో వ్యక్తిత్వ వికాసానికి, నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడుతుంది అని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు మాట్లాడుతూ.. విద్యార్థులకు క్లబ్‌లు, సేవా కార్యక్రమాలు, క్రీడా అవకాశాలన్నింటిని ఒకే చోట సమీకరించే వేదికగా 'వివిధ' నిలవనుందని, ఇది వారి ప్రతిభను వెలికి తీసే వేదికగా మారుతుంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వీసీ డాక్టర్ వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతురాజు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

మౌలిక వసతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శనివారం బీసీ హాస్టల్ విద్యార్థులతో పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ మరియు సాధికారిత అధిరబ్బానీ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద బీసీ హాస్టల్ అభివద్ధి పనులకు మద్దతుగా రూ.12.80 లక్షలు నిధులతో భవనాల వ్యెట్‌వాషింగ్, విండో మెష్ ఏర్పాటు, బోర్ మోటార్ అమరిక, స్టెయిన్‌లెస్ స్టీల్ వాష్ బేసిన్లు, ఓవర్‌హెడ్ వాటర్ రెండు ట్యాంకర్ల ఏర్పాటు, ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు, ప్లంబింగ్ మరమ్మతులు మరియు వంటగదికి అవసరమైన వంటగది ఉపకరణాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను, ట్రూ ఆఫ్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు గాంధీ రోడ్డు లోని డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్దన్ మాట్లాడుతూ ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల బ్రతుకులు అతలాకుతలం అవుతున్న తరుణంలో కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వ షరతులకు తలవొగ్గి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీ పెంచి భారాన్ని ప్రజలపై మోపడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వినియోగదారుల గృహాల్లో స్మార్ట్ మీటర్లను బిగించడానికి సిద్ధమైందని ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

పుంగనూరు: పెంచిన విద్యుత్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని స్మార్ట్ మీటర్లు ఇండ్లకు ఏర్పాటు ఉపసంహరించుకోవాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రామ్మూర్తి డిమాండ్ చేశారు. ఏపిఎస్ పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసమూర్తికి శనివారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్మీటర్లను, ట్రూఆఫ్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు. సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

500 మంది భక్తులకు అన్నదానం



ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరంలోని శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శనివారం మధ్యాహ్నం కార్వేటి నగరానికి చెందిన వీఆర్వో కె.లోకనాథం నాయుడు, కె.భారతి జ్ఞాపకార్థం వారి కుమారుడు కె.ప్రసాద్ రిటైర్డ్ వీఆర్వో ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మేళం రవి యాదవ్, ఉపాధ్యక్షులు రవిరెడ్డి, కార్యదర్శి గౌతమ్ రాజు, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయి రాయల్, భక్తులు పాల్గొన్నారు.

రూ.10వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- చౌడేపల్లి: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థి షాహిద్‌కి మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సహాయం అందించారు. చౌడేపల్లె గడ్డంవారిపల్లె రోడ్డులో గల జగనన్న కాలనీలో నివాసముంటున్న షాజహన్, నౌహీరాల కుమారుడు షాహిద్ ఇటీవల పదోతరగతి 472 మార్కులు సాధించి పాసైయ్యాడు. 2024 డిసెంబర్‌లో ఇంటి వద్ద కబడ్డీ ఆడుతుండగా జారిపడడంతో కుడి చెయ్యికు గాయమైంది. తేలికగా తీసుకున్న అతడికి చేదు అనుభవం ఎదురైంది. నొప్పి అధికంగా కావడంతో పుంగనూరు, మదనపల్లె, తిరుపతిలో వైద్యసేలందించినా ఫలితం లేకపోవడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరు కొలంబియా ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి బోన్ కేన్సర్‌గా నిర్ధారించారు. కార్పెంటర్‌గా కూలీ పనులు చేస్తున్న తండ్రి సుమారు రూ.2 లక్షలు పైగా ఖర్చు చేశారు. ప్రస్తుతం కీమోథెరఫి చేస్తున్నట్లు తెలిపారు. పేదరికంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అతడు వైఎస్సార్‌సీపీ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.దామోదరరాజు దృష్టికి తీసుకెళ్ళారు. మాజీమంత్రి సహకారంతో మంజూరైన రూ.10వేలు నగదును బాధితుడి తల్లితండ్రులకు అందజేశారు. ఇంకా ఆసుపత్రికి అయ్యే ఖర్చును ఎంపీ పివి. మిథున్‌రెడ్డి సహకారంతో పీఎం రిలీఫ్ ఫండ్‌తోపాటు తమ సహకారంతో చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్తాఫ్ ఉన్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కొత్తపల్లి శ్యామ్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్యామ్‌ను నియమించినట్లు వైసిపి అధిష్టానం శనివారం ఓ ప్రకటనలో ప్రకటించింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తనకు ఎస్ఆర్ పురం ఎస్సీ సెల్ అధ్యక్షులుగా అవకాశం రావడానికి కృషి చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జ్ కుపాలక్ష్మి, చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఎంసి విజయనందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని దళితుల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వైసిపికి విమర్శించే హక్కు లేదు..

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మామిడి రైతుల గురించి మాట్లాడే అర్హత వైసిపికి లేదని జిల్లా టిడిపి కార్యదర్శి కృష్ణమ నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీధర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి ప్రత్యేకంగా టన్నుకు రూ.4వేలను అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి ఎన్నడూ రైతులకు మేలు చేయలేదని మండిపడ్డారు. నేడు మామిడి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోలేదని అసత్యాలు పలకడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చేన్నాయుడు ఆధ్వర్యంలో రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. వైసిపి నాయకులు రైతులపై అనవసర మాటలు మానుకోవాలని సూచించారు. నెల్లెపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సుపరిపాలనకు ప్రజామోదం



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కరసనపల్లి గ్రామ పంచాయతీలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే యన్. అమరనాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈసంవత్సరకాల పాలనలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటికి చేరుకొని గ్రామస్తులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం అందించిన ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికంగా నీరు, డ్రైనేజీ, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు పంచాయతీ ప్రజలు ఆయన తెలియజేశారు.

కార్వేటినగరం: మండలంలోని సురేంద్ర నగరం, కెఎం.పురం పంచాయతీలలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సూపర్ సిక్స్ అమలుపై ప్రజలకు కరపత్రాలు పంచుతుంటే ప్రజల నుంచి విశేష స్పందన రావడం సంతోసంగా ఉందని టీడీపీ నాయకులు రాజా, చెంగల్రాయల్ యాదవ్, జనార్ధన్ రాజు, నాగేశ్వర రాజు అన్నారు. శనివారం ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు నేరుగా వివరించారు. టిడిపి రాజేంద్ర రెడ్డి, రవికుమార్, శ్రీనివాసులు నాయుడు, వెంకటముని పాల్గొన్నారు.

ఐరాల: మండలం, చిగరపల్లె పంచాయతీ, అగ్రహారపల్లె పంచాయతీలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి ఏడాది పాలన.. విజయాలను ప్రజలకు



వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలం అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షులు గిరిధర్ బాబు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని శెట్టివానాత్తం గ్రామపంచాయతీ శెట్టివానాత్తం గ్రామంలో మండలం టిడిపి అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు రఘు, ముని రెడ్డి, రవీంద్ర రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సిద్దయ్య శెట్టి, గుండయ్య, వేమన నాయుడు కార్యకర్తలతో కలిసి ఏడాది పాలనలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు కరపత్రాలు ద్వారా తెలియజేశారు.

ప్రారంభానికి నోచుకోని ఆర్‌బికె భవనం



ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లి పంచాయతీలలో గత ప్రభుత్వంలో రూ.20 లక్షలతో నూతన రైతు భరోసా కేంద్రం నిర్మాణంకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అయితే భవనం పనులు పూర్తి కాకపోవడంతో ఆర్‌బికె ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఈ భవనానికి చుట్టుపక్కల ముళ్ళకంపలతో నిండి పాడుపడిన భవనంలా దర్శనమిస్తోంది. ఈ విషయమై సదురు కాంట్రాక్టర్‌ను వివరణ అడుగగా పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఎనిమిది నెలల క్రితం ఈ భవనాలు మంజూరయ్యాయని, తమకు సగభాగం మాత్రమే బిల్లులు చెల్లించాలని లక్షల రూపాయలు అప్పులు చేసి భవనాలు నిర్మించే సమయానికి ఎన్నికల రావడం ఆ బిల్లులు పెండింగ్ అలాగే ఉండిపోయిందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఆర్‌బికె భవనం పనులు పూర్తి చేసి రైతులకు, ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లి పంచాయతీ ముంగరవారిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం తిరుపతికి చెందిన మార్క్స్ సొసైటీ సభ్యుడు జి. మోహన్ రావు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సులు, ప్యాడ్లు, కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేసినట్లు రొంపిచెర్ల ఎంఈఓ డి.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, సిఆర్పి కిరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జిగా రామచంద్ర



ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని పిబి.వాడ గ్రామ పంచాయతీకి చెందిన ఎం.రామచంద్ర తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగిందని మండల పార్టీ నాయకులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అనుగుణంగా సుమారు 6 బూత్‌లకు గాను పిబి.వాడ గ్రామ పంచాయతీకి సంబంధించి రెండవసారి యూనిట్ ఇన్చార్జిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి తనకు రెండవసారి యూనిట్ ఇన్చార్జిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల భవిష్యత్తే సహకార సంఘం లక్ష్యం

సింగిల్ విండో పర్సన్ ఇంచార్జ్ శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రైతుల భవిష్యత్తు కోసమే సహకార సంఘం ప్రధాన లక్ష్యమని గంగాధర నెల్లూరు సింగిల్ విండో పర్సన్ ఇన్చార్జి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం103వ అంతర్జాతీయ సహకార సంఘ దినోత్సవం సందర్భంగా గంగాధర నెల్లూరు సింగిల్ విండో కార్యాలయంలో సహకార సంఘ జెండా ఎగురవేసి మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు మంచి జరగాలని, వారి పురోభివృద్ధి ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. సింగిల్ విండో సీఈఓ విజయ్ కుమార్ రెడ్డి, డిసిసిబి బ్యాంకు మేనేజర్ గోమతి, బ్యాంకు సూపర్ వైజర్ విజయ, సింగిల్ విండో స్టాఫ్‌అసిస్టెంట్ మునస్వామి, హరిబాబు పాల్గొన్నారు.

హామీల అమలుకు ష్యూరిటీ లేదు.. వెంకటే గౌడ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ష్యూరిటీ లేదని ప్రజలను మోసం చేయడం గ్యారెంటీ అని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకటే గౌడ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వెంకటే గౌడ మండల వైఎస్ఆర్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారం వచ్చాక ఇచ్చిన మాట మర్చిపోయిన మొనగాళ్లు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అన్నారు. అధికార దాహంతో 143 హామీలు ప్రజలకు ఇస్తానని నమ్మించి ఏడాది పాలనలో కేవలం రెండు పథకాలను అరకొరగా అమలు చేసి హామీలు అమలు చేశామని చెప్పడం వారి అధికార దాహానికి నిదర్శనం అన్నారు. చంద్రబాబు ఏడాది పాలన అంతా రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారం నడిచిందని, వైసీపీ సానుభూతి పరులను టార్గెట్ చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కేసులకు, దౌర్జన్యాలకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. సింగల్ విండో మాజీ చైర్మన్ డి.శంకరప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి, జడ్పిటిసి సుష్మ కీర్తి, నాగ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

వి కోట: గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని పలమనేరు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో శనివారం మండల స్థాయి వైసిపి నాయకులు, కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ యువరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి వారు పాల్గొన్నారు. రీకాలింగ్ చంద్రబా బూస్ మేనిఫెస్టో 'క్యూ ఆర్ కోడ్ పోస్టర్' ను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీంకాన్, జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గౌస్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని మదనపల్లి రోడ్డులోని లయన్స్ క్లబ్‌లో పలమనేరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ అధ్యక్షతన గంగవరం మండల వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి.. రీకాలింగ్ చంద్రబా బూస్ మేనిఫెస్టో 'క్యూర్ కోడ్ పోస్టర్' ఆవిష్కరించడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, కూటమి ప్రభుత్వం మాత్రం ఏడాదిలో తామేదో సాధించినట్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచడం సిగ్గుచేటు అని విమర్శించారు.

మామిడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

పల్ప్ ఫ్యాక్టరీలను సిండికేట్ చేసి కుట్రలు చేస్తున్న వైసీపీ
తప్పుడు ఆరోపణలు చేసేందుకే జగన్ రెడ్డి యాత్ర



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు సకాలంలో నీరు అందడంతో గత పది ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మామిడి దిగుబడి పెరిగిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే తోతాపురి 4 లక్షల మెట్రిక్ టన్నులు మామిడి ఉత్పత్తి పెరిగిందన్నారు. అందువల్ల మార్కెట్ పై ప్రభావం పడడంతోనే రేటు కొంతవరకు తగ్గిందని భావించి ప్రభుత్వం ముందుగానే అంచనా వేసి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కిలోకు రూ. 4 సబ్సిడీని నేరుగా వారికే చెల్లిస్తోందన్నారు. మామిడి పల్ప్ ఫ్యాక్టరీలను సిండికేట్‌గా మార్చి రైతుల నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసేందుకు వైసిపి కుట్రలు చేస్తోందన్నారు. ఈ కుట్రలకు మద్దతు తెలిపేందుకే జగన్ రెడ్డి చిత్తూరు జిల్లాకు వస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. పీఎల్ఆర్, సిజిఆర్ ఫుడ్స్ ఫ్యాక్టరీలు ఎవరివో చెప్పాలని కిలో రూ.3 లకే కొనుగోలు చేస్తున్న విషయం వాస్తవం కాదా అన్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటూ వారిని ఆదుకుంటుంటే వైసిపి నేతలు సిండికేట్‌గా మారి రైతుల కష్టాన్ని దోచుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గం అన్నారు. తన హయాంలో ఏమాత్రం పట్టించుకోని జగన్ రెడ్డి కష్ట సమయాల్లో కిలోకు రూ.4లు ఇచ్చి ఆదుకుంటున్న ఈ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసేందుకే మామిడి రైతులపై దండయాత్రకు బయలుదేరుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, శ్రీరాములు, సుధాకర్ రెడ్డి, రోజా రెడ్డి, ఎంపీటీసీ కెళవాతి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ.. ఓ రైతు ఆవేదన

ప్రజాశక్తి - విజయపురం (నగరి)

సహకార సంఘంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించినా తనకు క్లియరెన్స్ సర్టిఫికేట్ ఇవ్వకుండా వేదిస్తున్నారంటూ రైతు ఎస్.వేలు శనివారం నగరి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద నిరసన వ్యక్తం చేశాడు. జాయింట్ కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన అర్జీ మేరకు విచారణ అధికారిగా ఉన్న నగరి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్‌కు వినతిపత్రం అందించడానికి విచ్చేసిన రైతు తన ఆవేదనను మీడియాకు వెల్లడించారు. విజయపురం మండలం కోసలనగరం సింగిల్ విండో సొసైటీ బ్యాంక్‌లో రుణము తీసుకొని దానిని ఆయన పూర్తిగా చెల్లించడం జరిగిందన్నారు. అయితే బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో తనకు నోడ్యూ సర్టిఫికేట్ ఇవ్వకుండా నన్ను ఆవేదనకు గురిచేస్తున్నారన్నారు. తనకు కంటి చూపు లోపం ఉందని, తన తండ్రి వృద్ధాప్యంలో ఉన్నారని తాము ఎన్ని రోజులు సర్టిఫికేట్ కోసం తిరగాలన్నారు. అధికారులు చలించకపోవడంతో మూడు నెలల క్రితం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను సంప్రదించగా ఆమె వెంటనే స్పందించి సాయంత్రంలోపు సర్టిఫికేట్ జారీచేయాలని జిల్లా సీఈవో శంకర్ బాబుకు సూచించారన్నారు. అయితే ఆయన స్పందించలేదన్నారు. పైగా ఇన్‌చార్జి సీఈవో రాధ, గత సీఈవో మురగయ్య అర్జీ వాపసు తీసుకో సర్టిఫికేట్ ఇస్తామని నచ్చజెప్పారని అయితే ఇప్పటి వరకు తనకు నోడ్యూ సర్టిఫికేట్ అందించలేదన్నారు. దీని కొరకు తన వద్ద నుంచి రూ.15వేలు లంచంగాను తీసుకున్నారన్నారు. నింద్ర ఎస్ఐ సంప్రదించగా ఆయన సమక్షంలో పది రోజుల్లో ఇస్తామని చెప్పారని అయినా సర్టిఫికేట్ ఇవ్వలేదన్నారు. అయితే సొసైటీకి వెళ్లి సీఈవో చెప్పినట్లు లెటర్ వ్రాసి సంతకం పెట్టు లేకుంటే జైలుకు పంపుతా అంటూ ఎస్ మాట్లాడినట్లు 99899 71772 నెంబరు నుంచి ఒక ఫేక్ కాల్ చేసి బెదిరించారన్నారు. ఆ నెంబరు ఎవరిదని ఆరాతీస్తే అది ఇన్‌చార్జి సీఈవో రాధ అల్లుడిదని తేలిందన్నారు. ఉన్నతాధికారులకు ఇచ్చిన అర్జీ మేరకు విచారణ అధికారిగా నియమించిన నగరి పర్సన్ ఇన్‌చార్జి కుమార్ ఈ అంశంపై విచారణ చేసి సర్టిఫికేట్ అందించాలని సూచించారని అయినా తనకు సర్టిఫికేట్ అందించలేదన్నారు. దీనిపై ఆయనను కలవడానికి నగరి పీఏసీఎస్‌కు విచ్చేసామని ఇకనైనా తనకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నాడు.

క్రైం న్యూస్

నకిలీ టోకన్లు విక్రయించిన వ్యక్తి అరెస్టు



వెంకటేష్‌ను అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో కలకలం రేపిన నకిలీ టోకెన్ల విక్రయం సంఘటనలో వ్యక్తిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప తెలిపారు. శనివారం సీఐ కార్యాలయం ఆవరణంలో నిందితుడ్ని అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల పరిధిలోని చింతమండి వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ నమోదు కోసం డీఎం పురం సచివాయంలో హార్టికల్చర్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న పుత్తూరు మండలం నందిమంగళం గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమారుడు వెంకటేష్ (31)ని విధులకు ఏర్పాటు చేశారు. అయితే అతను ఫ్యాక్టరీ వద్ద రైతులు టోకన్ల కోసం పడుతు ఇబ్బందులను ఆసరాగా తీసుకున్న హార్టికల్చర్ సిబ్బంది. నకిలీ టోకన్లు సృష్టించి రైతులకు అమ్మి సొమ్ముచేసుకున్నట్లు అందిన సమాచారం మేరకు అతనిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా ఒక్కో టోకన్ను రూ. వెయ్యికి అమ్మినట్లు తెలిందన్నారు. ఇలా సుమారు 31 నకిలీ టోకన్లు బయట పడడంతో అతినిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బస్సు కింద పడి మహిళ మృతి



తీవ్రంగా గాయపడి మృతి చెందిన లక్ష్మీదేవి

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ సమీపంలో ద్విచక్ర వాహనంపై భార్య భర్త వేళ్తుతుండగా భార్య ప్రమాదవశాత్తు రోడ్డుపై పడడంతో అదే సమయానికి తిరుపతి నుండి చిక్బలాపూర్ వెళు తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు మహిళను తొక్కించడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మహిళను సదుం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని సోమల హెడ్ కానిస్టేబుల్ మురళి రాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొదలకుంటపల్లి పంచాయతీ గ్రామానికి చెందిన రమణ, లక్ష్మీదేవి భార్యాభర్తలు ఇరువురు సోమలలో జరిగే వారపు సంతకు వస్తూ ఉండగా ద్విచక్ర వాహనం వెనకవైపు కూర్చుని ఉన్న లక్ష్మీదేవి (44) ప్రమాదవశాత్తు రోడ్డుపై పడడం అదే సమయానికి తిరుపతి నుండి చిక్బల్లాపూర్ వెళ్లేందుకు వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు మహిళపై తొక్కించుకు వెళ్లడంతో కుడి చేయి కడుపు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన 108 వాహనం ద్వారా సదుం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు,కుమారుడు ఉన్నారని రోజువారి కూలి పనులు చేసుకుంటూ భార్యాభర్తలు ఇరువురు జీవనం సాగించేవారని తెలిపారు. అనుకోని ప్రమాదంలో లక్ష్మీదేవి మృతి చెందడంపై ఎం వడ్డిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అలరించన దుర్యోధన వధ

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ, ధర్మరాజులస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ దురోద్యన వధ ఘట్టం హరికథా కాలక్షేపాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు ఆలపించారు. సాయంత్రం శ్రీవేంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగమడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. దుర్యోధన పాత్రధారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడిపెట్టించింది. దుర్యోధన వధ ఉభయదారులుగా తూర్పు వీధివారు వ్యవహరించారు. మధ్యాహ్నం హరిత (హెచ్ఎం). ప్రసాద్ (విశ్రాంతి వీఆర్వో) కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు.

నేడు అగ్ని గుండప్రవేశం

శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్ని గుండ ప్రవేశం ఉంటుందని ఆలయ ఆధ్యక్షుడు రవియాదవు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణంలో అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని మొక్కులున్న భక్తులు అగ్ని గుండ ప్రవేశానికి రూ.500లు చెల్లించి కంకణం ధరించాలన్నారు. మహిళలకు అగ్ని గుండ ప్రవేశం లేదని. మొక్కులున్న మహిళలు కంకణాలు ధరించి అగ్నిగుండం చుట్టు ప్రదక్షణ చేసి మొక్కులు తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యాక్షుడు కట్లరవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి,ఉప కోశాధికారి సాయిరాయల్. ఆలయ పూజారి సుమన్ యాదవ్, బాబా ఆచారి, కుమార్ ఆచారి, భక్తులు పలువురు పాల్గొన్నారు.

తెలుగు భాషా సాహిత్య సేవలో 'కళామందిరం'



ప్రజాశక్తి -గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పైనేని తులసినాథం నాయుడు, పుష్ప దంపతులు 30 లక్షల రూపాయల విలువ చేసే సొంత స్థలంలో 20 లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి పలమనేరు, గంగవరం సాయి గార్డెన్ సిటీలో నిర్మించిన కళామందిరం మూడవ వార్షికోత్సవాన్ని ఈ నెల ఆరవ తేదీ ఆదివారం నిర్వహిస్తున్న సందర్భంగా అక్కడ నిర్వహించే కార్యక్రమాల గురించి వారు వివరించారు. ఈ కళామందిరం 'నిత్య కళ్యాణం పచ్చ తోరణం' అన్నట్లు నిరంతర కార్యక్రమాల నిర్వహణతో పలువురి ప్రశంసలు అందుకుంటోంది. సంవత్సర కాలంలో 80 నుంచి 85 కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో కొన్ని కార్యక్రమాలు వందలాదిమందితో నిర్వహిస్తే, కొన్ని కార్యక్రమాలు 40, 50 మందితో నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నెలకొకసారి పాఠశాల స్థాయి విద్యార్థులకు పద్యాల పోటీలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి సంవత్సరంలో కనీసం 500 మందికి తగ్గకుండా బహుమతులు అందిస్తున్నారు. తెలుగు భాషా దినోత్సవం, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వార్షికోత్సవం, కళామందిరం వార్షికోత్సవం, ఉగాది, సంక్రాంతి



లాంటి సందర్భాలలో తెలుగు భాషాభిమానులు, సాహిత్యకారులు, కవులు, రచయితలను పిలిచి సంవత్సరానికి కనీసం 200 మందికి తక్కువ కాకుండా సత్కరించి పురస్కారాలు అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం వేమన జయంతి సందర్భంగా వేమన శతక పద్యాలు మాత్రమే వందకు పైగా చెప్పగలిగిన పిల్లలకు పోటీలు నిర్వహించి వందలాది మంది పిల్లలకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులు కూడా అందిస్తున్నారు. తులసినాథం నాయుడు తండ్రి పైనేని చిన్న బుచ్చినాయుడు స్మారకార్థం నగదు పురస్కారాలను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా అందిస్తున్నారు. తల్లి పైనేని మునెమ్మ స్మారకార్థం జాతీయ స్థాయిలో కథల పోటీలు నిర్వహించి పలువురికి నగదు పురస్కారాలు అందించి సత్కరిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి ప్రముఖ సంగీత విద్వాంసులచే త్యాగరాజ ఆరాధన ఉత్సవం నిర్వహిస్తున్నారు. క్రమం తప్పకుండా ప్రముఖ కవులు, రచయితల జయంతి, వర్ధంతుల కార్యక్రమాలను నిర్వహిస్తూ వారి గురించి, వారి రచనల గురించి నేటి తరానికి తెలుపుతున్నారు. కళామందిరానికి ఎంతమంది వచ్చినా వారందరికీ పుస్తక కానుకలు అందించి పంపటం ఆనవాయితీగా చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పరిధిలోని తెలుగు పిల్లలకు ఇప్పటి వరకు ఒక లక్ష 80 వేల పుస్తకాలను పంచిపెట్టిన ఘనత సాధించారు. ఉపాధ్యాయ దినోత్సవం, బాలల దినోత్సవం, మహిళా దినోత్సవం,మాతృ దినోత్సవం లాంటి సందర్భాలలో ఆయా రంగాలలోని ప్రముఖులను సత్కరిస్తున్నారు. వేసవి సెలవుల సమయంలో ఈ కళామందిరంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించి తెలుగు భాషను చదవడం, రాయడం నేర్పిస్తూ, రోజుకు ఒక పద్యం, కథ నేర్పిస్తున్నారు. ఈ వేసవి శిక్షణ తరగతుల్లో ముఖ్యంగా నైతిక విలువలు నేర్పడానికి కృషి చేశారు. ప్రతి సంవత్సరం 40 నుండి 50 మంది పిల్లలు ఈ తరగతులకు విచ్చేసి నేర్చుకుంటున్నారు. వీరి బాటలో మరింత మంది ముందుకు వస్తే తెలుగు భాషను అమృత భాషగా నిలుపుకోవచ్చుననడంలో అతిశయోక్తి లేదు.